క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో బుధవారం ఆలయ ధర్మకర్త పప్పిరెడ్డి సీతారామిరెడ్డి, గురుస్వామి ఎద్దులవెంకటరత్నం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, అయ్యప్ప స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప కన్యస్వాముల కలశాలు, చిన్నారుల ప్రమిదలచే గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే మదనపల్లె వారిచే కులుకుభజన, విజయనగరం వారిచే డప్పు వాయిద్యాలతో పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవంలో అయ్యప్ప మాలాధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయకర్పూరం సమర్పించారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నందిపల్లె, ఆర్సీఎం విచారణ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులకు క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని దుస్తులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ఎల్.ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా విచారణ గురువులు రెవ. ఫాదర్ రమేష్, రెవ. ఫాదర్ బాలసుందరం, సహాయ గురువులు ఫాదర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున బుధవారం పర్యటించారు. రాజీవ్ సర్కిల్ వద్ద ప్రధాన కాల్వలో పేరుకుపోయిన షీల్ట్‌ను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. సుబ్బిరెడ్డి కొట్టాలలో ఇంటింటా చెత్త సేకరణ, మంచి నీటి సరఫరా, వీధి దీపాల సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. హోమస్‌పేటలో టీ కప్పులు రోడ్డు మీద వేయకుండా డస్ట్ బిన్‌లో వేయాలని యజమానులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లకు గురు, శుక్రవారం నిర్వహించే శిక్షణా తరగతులకు సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ మైథిలి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలను స్థానికీకరణం వంటి పలు అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు.

చాగంటి నియామకంపై విమర్శలు సరికాదు

పోరుమామిళ్ల : ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర రావును ప్రభుత్వం సాంస్కృతిక సలహాదారులుగా నియమించడాన్ని కొందరు విమర్శించడం సరికాదని ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, సంప్రదాయాలు కనుమరుగుతున్నాయని తెలిపారు. ఈ తరుణంలో నైతిక విలువలు పెంపొందించుటకు చాగంటి ప్రవచనాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అపస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి బాలరంగయ్య, దండు సుబ్బారెడ్డి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పాత్రికేయులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాత్రికేయులపై దాడిని నిరసిస్తూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బుధవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడుతూ వార్త కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై అమానుషంగా దాడి చేయడం దారుణమన్నారు.

భగవద్గీత పఠించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలని కైవల్య సత్సంగ్ వ్యవస్థాపకుడు కైవల్య తీర్థస్వామి పేర్కొన్నారు. స్థానిక లైటుపాళెం సెంటర్ లోని ఎంపీఎస్ ధ్యాన కేంద్రంలో బుధవారం గీతాజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదివితే మానవుడికి విచక్షణా జ్ఞానం తెలుస్తుందన్నారు. ప్రపంచంలో భగవద్గీతకు మాత్రమే జయంతి ఉత్సవం జరుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ జ్ఞానేశ్వరమ్మ, కెనడా, కర్నూలు, గుంతకల్లుకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వాలీబాల్, కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు: యోగి వేమన యూనివర్సిటీ వార్షిక కాలేజీయేట్ ఫేజ్–2లో భాగంగా ఈ నెల 14, 15వ తేదీల్లో స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీలో వాలీబాల్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బి.జయరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

భక్తుల కొంగు బంగారం కాశినాయన

- 14 నుంచి 28వ ఆరాధన మహోత్సవం
- ప్రత్యేక ఏర్పాట్లను పూర్తిచేసిన కమిటీ సభ్యులు



పత్తూరులోని కాశిరెడ్డినాయన ఆలయం



ఆలయంలోని భూదేవి, శ్రీ కృష్ణుడు, వినాయకుని విగ్రహాలు



ఆలయంలోని కాశిరెడ్డి నాయన విగ్రహం

ఖాజీపేట : మండలంలోని పత్తూరు గ్రామంలో ఉన్న కాశిరెడ్డినాయన ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ కోరిన కోర్కెలు నెరవేరుతాయన్నది భక్తుల నమ్మకం. ప్రతి ఏటా ఎంతో వైభవంగా ఆలయ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

28వ ఆదారధన ఉత్సవాలు

14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు కాశినాయన ఆరాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 27వ ఆరాధన ఉత్సవాలు కావడంతో భక్తులు స్వామి దర్శనంకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

14 వతేదీన ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు మహాగణపతి, అన్నపూర్ణాదేవి, నవగ్రహ దేవతలకు ప్రత్యేక పూజలు ఉంటాయి. అలాగే సమరసత సేవాసమితి ఆధ్వర్యంలో చెక్కభజన రాత్రి 8 గంటల వరకూ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి చెంచులక్ష్మి నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 7 గంటలకు కాశిరెడ్డినాయన మహానైవేద్య ప్రసాదం సమర్పన జరుగుతుంది. ఉదయం 10 గంటలకు హరినామ భజన ఉంటుంది. అంతటితో ఆరాధన ఉత్సవాలు ముగుస్తాయి.

బండలాగుడు పోటీలు

ఉత్సవాలను పురస్కరించుకుని 14వ తేదీన బండలాగుడు పోటీలను ఆలయ కమిటీ వారు నిర్వహిస్తున్నారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30వేలు నాలుగోవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలుగా నిర్ణయించారు. న్యూ క్యాటగిరి విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ కరోనా సమయంలో తీసుకున్న అదనపు పారిశుద్ధ్య సిబ్బందికి బకాయి ఉన్న నాలుగు నెలల వేతనాన్ని మంజూరు చేసి వారిని ఆప్కాస్ సంస్థలో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్మికుల 16 రోజుల సమ్మె కాలానికి వేతనాన్ని మంజూరు చేయడంతో పాటు పారిశుద్ధ్య విభాగ కార్మికులకు కొబ్బరినూనె, చెప్పులు, సబ్బులు, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా చెత్త తరలించే వాహనాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు సచివాలయ శానిటరీ సెక్రటరీల వేధింపులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు శ్యామ్ ప్రవీణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరి, ప్రధాన కార్యదర్శి డి.నాగేంద్రబాబు, కోశాధికారి కె.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



క్షయవ్యాధిగ్రస్తునికి సూచనలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

బద్వేలు అర్బన్ : క్షయవ్యాధి రహిత సమాజమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేసి క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని అదనపు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రవిబాబు, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్‌లు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలను తనిఖీ చేసి అనంతరం ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సురేంద్రనగర్‌లో క్షయవ్యాధిగ్రస్తులతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని, ప్రస్తుతం మెరుగైన వైద్య చికిత్సలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాధిగ్రస్తులు నిర్దేశించిన సమయం వరకు చికిత్స తీసుకోవడం వలన వ్యాధి నయమవుతుందన్నారు. క్షయవ్యాధి వ్యాధిగ్రస్తులకు తగిన సూచనలు, సలహాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్, క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకులు భారతి, బ్రహ్మానందరెడ్డి, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



ఎలక్ట్రిక్ మోటారు బైక్ షోరూంను ప్రారంభిస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్

గోపవరం : కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వలన అన్ని విధాలా కాలుష్య నివారణ జరిగి మానవజాతి ఆరోగ్యంగా జీవిస్తుందన్నారు. బుధవారం మండలంలోని మడకలవారిపల్లెలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి పక్కనే ఈజీ రైడ్ గ్రీన్ ఎలక్ట్రికల్ స్కూటర్ల షోరూం ప్రారంభోత్సవానికి ఆర్డీఓ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాల బ్యాటరీలపై ఇంకా రీసెర్చ్ జరుగుతుందన్నారు. బద్వేలు మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో అన్ని వాహనాలు కూడా ఎలక్ట్రిక్ టెక్నాలజీ అమలు చేస్తే మన దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గానుగపెంట హనుమంతరావు, షోరూం అధినేత షేక్ అన్వర్‌బాషా, స్పెషలిస్టు టెక్నీషియన్ కొప్పరపు సూర్య, విశ్రాంత డిప్యూటీ డీఈఓ మార్కారెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు పగలగొడితే కఠిన చర్యలు



అశోక్‌నగర్‌లో క్లోరిన్ పరీక్షలను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలో ఎక్కడ కూడా అనుమతులు లేకుండా వివిధ రకాల అవసరాల నిమిత్తం గుంతలు తవ్వి పైపులైన్లకు నష్టం కలిగిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలోని చెముడూరు ట్యాంకు పరిధిలోని పైపులైను చెన్నంపల్లె వద్ద డ్యామేజీ అయిన నేపథ్యంలో బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో వివిధ రకాల పనుల నిమిత్తం అనధికారికంగా గుంతలు తీస్తూ పైపులైన్లకు నష్టం కలిగించడం వలన నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని, ఇకపై లాంటి చర్యలను ఉపేక్షించమని హెచ్చరించారు. ఎవరైతే పైపులైన్ల డ్యామేజీకి కారణమవుతారో వారితోనే మరమ్మత్తు ఛార్జీలు కూడా వసూలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలి

నీటి సరఫరా చేయు సిబ్బంది నీటిలో క్లోరిన్ శాతాన్ని గుర్తించేందుకు తరచుగా క్లోరిన్ పరీక్షలు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని అశోక్‌నగర్‌లో క్లోరోస్కోప్‌తో క్లోరిన్ టెస్టులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు పైపులైను లీకేజీలు లేకుండా చూసుకోవాలని కోరారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో ఎస్‌వీసీఎం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కూటమి పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంటు వేదికగా తమ వాణిని వినిపించాలని కోరారు. విభజన చట్టంలో పొందుపరిచిన మేరకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆ పనులు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు వేణు పాల్గొన్నారు.

ఘనంగా గీతాజయంతి వేడుకలు

కలసపాడు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మందిరంలో బుధవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గీతాజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీతా పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు మలిపెద్దునాగరాజ, జాలాదినారాయణ, గొంట్లరామాంజనేయులు, తుమ్మలపెంటసత్యవతమ్మ, శకుంతల, జాలాదిభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

12, 13వ తేదీల్లో ప్రజా ప్రతినిధులకు శిక్షణ

ప్రొద్దుటూరు: ఈ నెల 12, 13వ తేదీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ సానేపల్లి సూర్యనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

ప్రొద్దుటూరు రూరల్: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వెంటనే బీమా చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్ రెడ్డి కోరారు. మండలంలోని ఉప్పరపల్లె రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు విస్తరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడి, ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ ఆదాయం వచ్చే పంటలు వేసేలా రైతును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో రైతు సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు అవసరమైన సూచనలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హరీంద్ర, మనోహర్, రైతులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుక

ప్రొద్దుటూరు : మండలంలోని వాగ్దేవి ఇంజినీరింగ్ కాలేజ్‌లో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. క్రిస్మస్ పాటలు ఆలపించారు. శాంటాక్లాజ్ వేషధారణ, చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పాస్టర్ విశ్వప్రసాద్, సిస్టర్ ఫోనిక మాట్లాడుతూ సమానత్వం, స్నేహభావం, మానవతా విలువలు అలవర్చుకుని తోటి వారికి సాయం చేయాలని తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్ధేశ్వరరావు, వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థులు, స్నేహ భావం, సహకారం పెంపొందించుకోవాలని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి నూర్పిళ్లను రైతులు తాత్కాలికంగా ఆపుకోవాలి

చాపాడు : రాబోయే మూడు రోజుల పాటు తుఫాను వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వరి నూర్పిళ్లను రైతులు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ తెలిపారు. మండలంలోని చిన్న గురువళూరు, కుచ్చుపాప గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఎవరైనా నూర్పిళ్లు చేసి ఉంటే ధాన్యం వర్షపు నీటిలో తడవకుండా టార్పాలిన్ పట్టలతో కప్పి ఉంచాలన్నారు. అధిక వర్షాలు పడితే నీటి నిలువ లేకుండా నీరు బయటికి వెళ్లిపోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ధాన్యం తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. తుఫాను పోయిన తర్వాత పైర్లకు తెగుళ్లు సోకకుండా ట్రై సైక్లోజోల్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కాశినాయన : మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ యు.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. 2012 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 12 సంవత్సరాల కాలంలో పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది వివిధ కేడర్లలో పనిచేసిన మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు చనిపోతే సరైన సర్వీసు రూల్స్ లేకపోవడం వలన ఆ కుటుంబాలకు కారుణ్య నియామకాలు లేక ఆర్థికంగా వారు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కారుణ్య నియామకాలను చేపట్టాలని, పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, తెలుగు ఎస్‌జీటీలను పీజీటీలుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నాయకులు వాకాచంద్రశేఖర్, బాలరాజు, రీజియన్ కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : అన్నదాతలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన నాలుగు మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్న సూపర్‌సిక్స్ హామీ అమలు చేయలేదని విమర్శించారు. సుఖీభవ పుట్టుబడి సాయం బడ్జెట్‌లో రూ. 10,700 కోట్లు పెట్టాల్సి ఉండగా దాని ప్రస్తావనే లేదన్నారు. 2014లో రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చాక మాట నిలబెట్టుకోలేదన్నారు. ఇది చంద్రబాబు నైజమని గోవిందరెడ్డి మండిపడ్డారు. ఏడాదికి రూ. 20 వేలు ఇచ్చేంత వరకు పోరాడాలని గోవిందరెడ్డి పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. రేపు కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని గోవిందరెడ్డి పార్టీ వర్గాలకు పిలుపిచ్చారు. సమావేశంలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి. కోడూరు మండలాల జెడ్పీటీసీలు దేవసాని సత్యనారాయణరెడ్డి, అంకన గురివిరెడ్డి, ముత్యాల ప్రసాద్, దావీదు, మార్కెట్‌కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, ఎంపీపీ నారాయణ, వైస్ ఎంపీపీ సీఎం బాషా, మాజీ ఎంపీపీ సూదా రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సుదర్శన్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, గురివిరెడ్డి, యోగానందరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచులు రవిచంద్రారెడ్డి, రాళ్లపల్లె నరసింహులు, జేఏసీ కన్వీనర్ హనుమంతారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మయ్య, రుద్రవరం రాము, సాయి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో 'కూటమి' విఫలం



మాట్లాడుతున్న ఫాతిమా

బద్వేలు అర్బన్ : శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని డీవైఎఫ్ఐ మహిళా కో కన్వీనర్ ఎస్.కె.ఫాతిమా పేర్కొన్నారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ మహిళా కన్వీనింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై, విద్యార్థినులపై వరుస దాడులు జరుగుతున్నా గట్టి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేవలం ఘటనలు జరిగినప్పుడు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నారే తప్ప వారిపై నిర్భయ లాంటి చట్టాలను అమలు చేసి కఠిన శిక్షలు అమలయ్యేలా చూడటం లేదని అన్నారు. ఇటీవల నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలో పట్టపగలే ఓ ప్రేమోన్మాది బాలికపై పెట్రోలు పోసి నిప్పంటించడం చూస్తే రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థినులకు రక్షణ కరువైనట్లు స్పష్టమవుతుందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న హత్యలు, దాడులను నియంత్రించేందుకు గట్టిగా కృషి చేయాలని, లేనిపక్షంలో డీవైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మహిళా విభాగం నాయకురాళ్లు నాగేశ్వరి, సాయిలక్ష్మి, స్వీటీ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు

చాపాడు : ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న గ్రామాల్లోని సాగునీటి సంఘం ఎన్నికలు ఈనెల 14న నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్‌ను ఆయా ఎన్నికల నిర్వహణ కేంద్రాల వద్ద ప్రదర్శించారు. మండల పరిధిలో 10 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కెనాల్ పరిధిలోని దువ్వూరు, చాపాడు, మైదుకూరు, ఖాజీపేట మండలాలతో సంబంధం ఉన్న మండలంలోని నీటి సంఘాలకు సైతం ఒకే రోజున ఎన్నిక నిర్వహించనున్నారు. దువ్వూరు కేసీ కెనాల్ పరిధిలోని 62 అన్నశాస్త్రులపల్లె, 63 మడూరు, 64 చియ్యపాడు, మైదుకూరు కేసీ కెనాల్ పరిధిలో 67 మడూరు, 68 ఉప్పరపల్లె, 69 అనంతపురం, 70 అనంతపురం, 71 సోమాపురం, 74 అల్లాడుపల్లె, 75 మిడుతూరు సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నిటిలో ఒక సంఘానికి ఒక్కో చైర్మన్‌ను ఓటర్లు ఎన్నుకుంటారని, సాగునీటి సంఘాల చైర్మన్లు అందరూ మండల చైర్మన్ ఎన్నుకోనున్నారు. 63వ సంఘానికి అన్నవరం జెడ్పీ హైస్కూల్‌లో, 64 సంఘానికి చియ్యపాడు జెడ్పీ హైస్కూల్‌లో, 67 సంఘానికి మడూరు గ్రామ సచివాలయం, 69వ సంఘానికి చాపాడు ఎంపీడీఓ కార్యాలయం, 70వ సంఘానికి చాపాడు జెడ్పీహైస్కూల్, 71వ సంఘానికి సోమాపురం గ్రామ సచివాలయం, 74వ సంఘానికి లక్ష్మీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎన్నిక నిర్వహిస్తారు. 68వ సంఘానికి ప్రొద్దుటూరులో, 75వ సంఘానికి ఖాజీపేట, 62వ సంఘానికి దువ్వూరు మండలంలో ఎన్నిక చేపట్టనున్నారు.

6చాపాడులో ఎన్నిక పై రైతుల్లో చర్చ..

ఈ నెల 14న మండల వ్యాప్తంగా ఏడు సాగునీటి సంఘాలకు ఎన్నిక జరుగనుంది. వీటిలో ఐదు సంఘాలకు ఆయా గ్రామాల్లోని సచివాలయాలు, హైస్కూల్‌లలో ఎన్నికలు నిర్వహించనుండగా, 69, 70వ సాగునీటి సంఘాలకు మాత్రం మండల కేంద్రమైన చాపాడులో నిర్వహించనున్నారు. ఈ సంఘాలకు మాత్రమే ప్రత్యేకంగా నిర్వహించడంపై రైతుల్లో చర్చ జరుగుతోంది. ఈ రెండు నీటి సంఘాలు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వగ్రామమైన నక్కలదిన్నె, తమ బంధువర్గం గత గ్రామాల పరిధిలో ఉన్నాయని, ఈ కారణంతోనే అక్కడ జరుపకుండా చాపాడులో జరుపుతున్నారని ఆయా ప్రాంతాల రైతులు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో ఇక్కడ నిర్వహిస్తున్నారా లేక మరేదైనా కారణం ఉందా అనే సందేహాన్ని రైతులు వ్యక్తపరుస్తున్నారు. తహసీల్దారు రమాకుమారిని వివరణ కోరగా.. గతంలో జరిగిన ఎన్నికలను చాపాడులో నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కోరారు. మండలంలోని చౌడూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దారు గంగయ్య, చంద్రుడు, గురులక్ష్మీదేవి, అధికారులు పాల్గొన్నారు.

చాపాడు : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహిస్తున్నామని వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు రమాకుమారి తెలిపారు. మండలంలోని పల్లవోలు గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులకు సంబంధించి భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఖాజీపేట: మండలంలోని రైతులు చుక్కల భూముల సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి తహసీల్దార్‌కు మహబూబ్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. మండలంలో దాదాపు 4వేల ఎకరాల భూములు ఇలా ఉన్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి 4 వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించుకున్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

గోపవరం : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మండలంలోని రాచాయపేట సచివాలయం వద్ద తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు తెలిపారు.